క్లుప్తంగా

వార్డు సచివాలయ ఏర్పాట్ల పరిశీలన



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 32వ వార్డు ప్రజల సౌకర్యార్థం త్వరలో ప్రారంభం కానున్న వార్డు సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఆలూరు రోడ్‌లో ఏర్పాటు కానున్న 35వ సచివాలయానికి అవసరమైన కంప్యూటర్లు, రికార్డులు, ప్రింటర్, ఫర్నీచర్ తదితర సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వార్డు ప్రజలకు అన్ని రకాల సేవలను అందించాలని, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిషనర్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్త సచివాలయ నిర్వహణపై సిబ్బందికి ఆయన తగు సూచనలిచ్చారు.

రికార్డులు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని ఎస్‌ఐ శివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని అనంతపురం- తాడపత్రి రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారుడు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు.వాహనాలు అతివేగంగా నడపరాదన్నారు. అనంతరం రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్‌ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌ఎంకు ఆహ్వానం



డీఆర్‌ఎంకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: ఈ నెల 6వతేదీన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహావిష్కరణ, పార్కు ప్రారంభోత్సవానికి హాజరుకావాలని డీఆర్‌ఎం కే.వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం డీఆర్‌ఎంను ఆయన చాంబర్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘాల నాయకులను ఎమ్మెల్యే స్వయంగా ఆహ్వానించారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేద్దాం

గుంతకల్లు రూరల్: లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేద్దామని వైద్య ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. గురువారం కసాపురం గ్రామంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ హరినాథ్ మాట్లాడుతూ బాలికలను బాలురతో సమానంగా చదివించాలన్నారు. భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎం జమృత బేగం తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు



మహిళతో మాట్లాడుతున్న పోలీసులు

శింగనమల: కుటుంబ కలహాలతో శింగనమల చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి వచ్చిన ఓ మహిళను పోలీసులు కాపాడారు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం విద్యానగర్‌కు చెందిన ఓ మహిళ శింగనమల చెరువు వద్దకు వచ్చింది. తన భర్తకు వీడియో కాల్ చేసి చెరువులోకి దూకి చనిపోతానని తెలియజేసింది. ఆమె భర్త వెంటనే 100 కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు వెంటనే కానిస్టేబుల్ ఇక్బాల్ బాషా, ఆరిఫ్‌ను వెంటనే చెరువు వద్దకు పంపి మహిళను కాపాడారు. ఆ తర్వాత ఆమె భర్తను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఫక్కీరప్ప సిబ్బందిని అభినందించారు.

సంక్షేమ పథకాలతో సమగ్రాభివృద్ధి

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



రామరాజుపల్లిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పై పూలవర్షం కురిపిస్తున్న గ్రామస్తులు

పెద్దవడుగూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సమగ్రామభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మేడిమాకులపల్లి నుంచి ప్రజా సంక్షేమ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా దారి వెంట వెళుతున్న రైతులు ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగితే వలంటీర్ల ద్వారా సక్రమంగా అందుతున్నాయని తెలియజేశారు. కండ్లగుడూరు గ్రామానికి యాత్ర చేరుకోవడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు విజయతిలకం దిద్ది పాదయాత్ర దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. రైతుల కష్టాలను తీర్చడానికి రైతు భరోసా పథకంతోపాటు గ్రామాల్లో ఆర్బీకేలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. పంటలకు ఎలాంటి తెగుళ్లు వచ్చినా తక్షణమే రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలించి తెగులు నివారణకు సూచనలిస్తారన్నారు. ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంచారన్నారు. నవరత్నాల పేరుతో ప్రవేశ పెట్టిన ప్రతి పథకం ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. గతంలో జేసీ సోదరులు ప్రజల వద్దకు రాకుండా కొందరు వ్యక్తుల వద్దకు వచ్చి వెళ్లేవారే తప్ప ఏనాడు ఓట్లు అడిగిన పాపాన పోలేదని అన్నారు. వారి ఎదుట ఖరీదైన దుస్తులు వేసుకున్నా ఓర్వలేని పరిస్థితి ఉండేదన్నారు. 30 ఏళ్ల పాలనలో జేసీ సోదరులు దొంగ తనాలు, దోపిడీలు తప్ప ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. ప్రజలను మోసం చేసి అక్రమంగా సంపాదించుకొని తిరుగుతున్నది జేసీ సోదరులేనని విమర్శించారు. కాంట్రాక్టర్ల వద్ద నుంచి డబ్బు దండుకొన్నదని కూడా వారేనని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వర్షాలు బాగా కురుస్తున్నాయని, రైతాంగానికి రెండు పంటలకు నీళ్లు ఇస్తున్నామన్నారు. పాదయాత్రలో జేసీ సోదరులు వేసిన కరపత్రాలపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని ఎన్నుకుంటే గ్రామాల్లో రాజకీయ కక్షలను ప్రేరేపించి గ్రామాలను నాశనం చేస్తారన్నారు. వీటిని ప్రజలు దృష్టిలో పెట్టుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం సి.రామరాజుపల్లి మీదుగా రాంపురానికి యాత్ర చేరుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా నవరత్నాల సందడి



ఇంటింటా సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పల్లెల్లో ఇంటింటా నవరత్నాల సందడి నెలకొందని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం దుగ్గుపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దుగ్గుపల్లిలో ఆలూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ ఎలాంటి సిఫారసు లేకుండా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గడప వద్దే ప్రభుత్వ పథకాలు, సేవలు అందుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యల్లనూరు మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీన్ని ఓర్వలేని ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలాంటి వారు చెప్పే మాటలను ఎవ్వరూ నమ్మవద్దని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. తెలుగుదేశం నేత లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర కాదు యువ వైఫల్య యాత్ర అని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, సర్పంచులు రామాంజులరెడ్డి, కవిత, గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, పెద్దిరెడ్డి, పురుషోత్తంనాయుడు, బాలవెంకటరెడ్డి, నాగరంగయ్య, శంకర్‌రెడ్డి, శివనాగిరెడ్డి, తహసీల్దారు రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఏఓ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ సుప్రజ, ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

తాడిపత్రి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హౌసింగ్, మెప్మా అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ , మెప్మా అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో సజ్జలదిన్నె 1, 2, యర్రగుంటపల్లి, గన్నేవారికాలనీల్లోని లేఔట్ల పరిధిలో 3,649 జగనన్న పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఇందులో ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఉగాది పర్వదినానికి 750 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ డీఈ సుబ్బరాయుడు తెలిపారు. మిగితా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు సతీష్, ధరణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల అమాయకత్వం, నిరుద్యోగ యువతను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు నగదు కాజేస్తున్నారని పేర్కొన్నారు. చదువుకున్న వారు కూడా అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారని తెలిపారు. లోన్‌యాప్, ఓఎల్‌యక్స్ యాప్‌లతో పాటు తదితర సైబర్ నేరాలకు పాల్పడే వారి పట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. సైబర్ నేరగాళ్లని అనుమానం కలిగినట్లయితే 1930 ఫోన్ చేసి రక్షణ పొందాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

రేపు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. శుక్ల చతుర్దశి సందర్భంగా ఉదయం నుంచే పలు పూజలు చేసి రాత్రి 8 గంటలకు రథోత్సవం ప్రారంభించనున్నారు. స్వామి నివాస గ్రామమైన కోటంక పురవీధుల్లో స్వామి వెండి విగ్రహాలను రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పమాలలతో అలంకృతమైన రథంపై ఆశీనులుగావించి భక్తాదుల భజనలు, మేళ తాళాలతో సన్నిధికి చేరుస్తారు. ఆదివారం ఉదయం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ,దేవసేన శ్రీవారి కల్యాణం ఉంటుంది.రథోత్సవం సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు పేర్కొన్నారు. అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులు కోటంక ఆలయం వరకూ నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీపీ బీవీ మాధవి

గుంతకల్లు రూరల్: మండలంలో శుక్రవారం నుంచి 15వ విడత సామాజిక తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీవో జాషువా సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీడీఓ జాషువా, జెడ్పీటీసీ కదిరప్ప మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 2021-22లో ఉపాధి హామీ కింద రూ.17.74 కోట్లు ఖర్చు చేశారన్నారు. తనిఖీ బృందం సభ్యులు ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిచడంతోపాటు అదే రోజు సాయంత్రం గ్రామసభల్లో పరిశీలించిన అంశాలను తెలియజేస్తారన్నారు. దాదాపు 10 రోజుల పాటు సాగే తనిఖీలకు ఉపాధిహామీ సిబ్బందితో పాటు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఏపీఓ సాలయ్య, మండల ఇంజినీర్ ఓబులేసు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దత్తు, ఎంఈఓ కుళ్లాయప్ప, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి : పట్టణ సమీపంలోని పెన్నానది కొత్త బ్రిడ్జి క్రింద గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న షేక్ హాజీవలి, బషీర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1,250 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన షిర్డిసాయిబాబా దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో ఉన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మేడిమాకులపల్లి నుంచి ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు.

మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయండి

గుత్తి: పట్టణంలోని ఏడీజే కోర్టుతో పాటు జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఈ నెల 11న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని గుత్తి ఏడీజే కబర్ది కోరారు. పట్టణంలోని ఏడీజే కోర్టులో గురువారం పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కక్షిదారులతో మాట్లాడి రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించాలని సూచించారు. న్యాయమూర్తులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

పామిడి: పామిడిలో గురువారం పంచాయతీ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు జెడ్పీటీసీ శోభారాణి, వైఎస్సార్‌సీపీ నేత మధుసూదన్‌రెడ్డి దంపతులు చీరలు పంపిణీ చేశారు. తమ కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

శివ పార్వతులకు ప్రత్యేక పూజలు



పట్టు వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

పెద్దపప్పూరు: అశ్వత్థం తరునాలలో భాగంగా గురువారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి ఆశ్వత్థ నారాయణస్వామి శివపార్వతులను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగం

గార్లదిన్నె: ముంటిమడుగు కొత్తపల్లిలో గురువారం పప్పుశనగ పంటలో పంటకోత ప్రయోగం చేసినట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. రైతు పెద్దయ్య పొలంలో పంటకోత ప్రయోగం చేయగా ఒక ఎకరాలో 480 కేజీలు, అల్లు రామసుబ్బయ్య పొలంలో 450 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. సాధారణంగా 600 నుంచి 700 కేజీల దిగుబడి రావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మమత, ఎంపీఈఓ లలిత, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

శింగనమల: వ్యవసాయంలో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఏఓ చిన్నమ్మ పేర్కొన్నారు. గురువారం సోదనపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చిన్నమ్మ మాట్లాడుతూ పొలంకు చుట్టూ రక్షణ పంటలు జొన్న, ఆముదం పంటలు వేసుకోవడం వల్ల తెగుళ్ల రాకుండా ఉంటాయన్నారు. సంప్రదాయ పద్ధతిలో పశువుల ఎరువు , ఇతర సహజ ఎరువుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పవన్‌కుమార్, రాజేశ్వరి, నవీన్, ఆదినారాయణ, జయలక్ష్మి, సంధ్యారాణి, రాజారెడ్డి, భార్గవి, అమరేష్ అఖిల, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి



నర్సరీని పరిశీలిస్తున్న హెచ్‌ఓ ఉమాదేవి

యాడికి: కూరగాయల నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలని తాడిపత్రి ఉద్యాన శాఖాధికారి ఉమాదేవి తెలిపారు. గురువారం మండలంలోని చందన గ్రామంలో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వెజిటబుల్ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో చందనలో 2, రాయలచెరువులో 1, పెద్దపేటలో 1 నర్సరీ ఉందన్నారు. గతేడాది నుంచి కూరగాయల నర్సరీ నిర్వాహకులు రూ.1000 చలనాతో పాటు, నర్సరీ సాగు చేసే రైతుల పొలానికి సంబంధించిన డాక్యుమెంట్ నకళ్లు, ఓనర్ ఆధార్ కార్డుతో ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చందన ఆర్బీకే వీహెచ్‌ఏ యతీషా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రీనివాస చౌదరికి ఘన నివాళి

పామిడి: పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో గురువారం ఏఐఎస్‌ఎఫ్ నేత శ్రీనివాస్ చౌదరి 38వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి వినోద్ మాట్లాడారు. ర్యాగింగ్‌ను అడ్డుకునే క్రమంలో శ్రీనివాస్ చౌదరి తన ప్రాణాలను పాగొట్టుకున్నాడన్నారు. నాయకులు, సూరి, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ

పామిడి: మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం డీపీఓ ప్రభాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. డీఎల్‌పీఓ దామోదర్‌రెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల: శింగనమల నియోజకవర్గం ఖాళీగా ఉన్న 32 ఎఫ్‌పీ షాపులకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. గార్లదిన్నె మండలంలో 1, పుట్లూరు 10, యల్లనూరు 6, బుక్కరాయసముద్రం 6, శింగనమల మండలంలో 9 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 11న దరఖాస్తు చేసుకోవాలని, 15న రాత పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు.

జీసీఎస్ మండలాధ్యక్షుడిగా శివప్రసాద్

యాడికి: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మండలాధ్యక్షుడిగా యాడికి శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉత్తర్వులు ఇచ్చినట్లు శివప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తి వంచనలేకుండా పని చేస్తానన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రి టౌన్ : స్థానిక ఎస్సీనగర్, అంబేడ్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాను బీజేపీ నాయకులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్‌ను కలసి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగనాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు అంజనేయులు, నాయకులు సంజీవరెడ్డి, కృష్ణమోహన్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో కాంట్రాక్టు ఉద్యోగి ఎం. ఆంజనేయులు (40) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. కసాపురం గ్రామానికి చెందిన ఎం ఆంజనేయులు ఆలయంలో పెయింటర్‌గా విధులు పని చేసేవాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఆలయ కార్యాలయానికి చేరుకున్న ఆంజనేయులు కాసేపటికి ఛాతిలో మంటగా ఉందంటూ ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కుర్చీలోంచి లేచి రెండు అడుగులు వేయగానే కుప్పకూలి కింద పడిపోయాడు. తోటి సిబ్బంది వెంటనే అతడిని గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి అవార్డుల ప్రదానం



అవార్డు అందుకున్న కేవీ రాముడు



బీ శంకర్



ప్రసాద్



జీ బాలస్వామి



వైకే మూర్తి



హెచ్‌కే పీరా



ఎస్ ఉస్మాన్



డీ ఈరన్న



కే రాజు

రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం అనంతపురం డిపోలో ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ముఖ్యఅతిథిగా సీసీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని హాజరై ప్రమాద రహిత డ్రైవర్లకు రివార్డు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇద్దరికి గాయాలు

పామిడి: పీ కొండాపురం సమీపాన గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి స్థానికుల వివరాల మేరకు.. నార్పలకు చెందిన రాములమ్మ, తులసి పనిమీద వారు ఆటోలో వచ్చారు. పీ కొండాపురం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ఉన్న రాములమ్మ, తులసికి గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాడిపత్రి అర్బన్: బైక్‌ను లారీ ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమయంగా ఉంది. స్థానికుల వివరాల మేరకు.. యల్లనూరు మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన వెంకటనాయుడు, ప్రసాదరెడ్డి సిబిరోడ్డులో బైక్‌పై వెళుతుండగా రామచంద్ర లాడ్జీ సమీపంలో లారీ ఢీకొంది. వెంకటనాయుడు చేయి నుజ్జునుజ్జయ్యింది. మరో వ్యక్తి ప్రసాద్‌రెడ్డి గాయపడ్డాడు. వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వారిని అనంతపురానికి తీసుకెళ్లారు.